www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 16 డిసెంబర్ 2025
5
అన్నమయ్య

19న మెగా జాబ్‌మేళా : కలెక్టర్

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి

ప్రజాశక్తి-రాయచోటి: ప్రభుత్వం ఏపి స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లాలోని గార్డెన్ వ్యాలీ ఇంటిగ్రేటెడ్ క్యాంపస్, అంగళ్లులో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్. సోమవారం కలెక్టరేట్‌లో జాబ్ మేళా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున మాట్లాడుతూ ఉద్యోగ మేళా ఈ నెల 19న నిర్వహిస్తున్నామని, యాక్సిస్ బ్యాంక్, ఆర్బిఎల్ బ్యాంక్, ఫ్రెష్ కంపెనీ, టాటా క్యాపిటల్, డాక్టర్ రెడ్డీస్ (గ్, ఎంఆర్ఎఫ్, ఎస్‌బిఐ లైఫ్, అపోలో ఫార్మసీ, ముత్తూట్ ఫైనాన్స్, అమర్ రాజా (గ్రూప్, యంగ్ ఇండియా తదితర కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. జిల్లాలోని ఆసక్తి, ఉన్న యువతీ, యువకులు కింది ఉద్యోగమేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు https://naipunyam.ap.gov.in/user-registration రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9618655759, 9553202509,8897776368 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదనరావు, డిస్ట్రిక్ట్ సర్వే ఆఫీసర్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దుకు పోరాటాలే మార్గం

- సిఐటియు జెండా ఆవిష్కరణలో నాయకులు

రాయచోటి : మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

కార్మిక ఉద్యోగులకు నష్టం చేసే లేబర్ కోడ్స్‌ను తెచ్చిన కేంద్ర ప్రభుత్వ విధానాలను బలమైన నిరవధిక ఐక్య పోరాటమే మార్గం అని యుఐఇ డబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. సోమవారం సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిఐటియు ఆలిండియా 18వ మహాసభల సందర్భంగా ప్రతిజ్ఞ దినోత్సవం సందర్భంగా సిఐటియు జెండా వందనం కార్యక్రమం జిల్లాలో విజయవంతమైనట్లు తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జెండా ఆవిష్కరణలో అంగన్వాడీ, మున్సిపల్, విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎ.వి.రమణ జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి మణి రెడ్డెప్ప, రామాంజులు, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.వి.రమణ, చెన్నయ్య రాంబాబు, సిద్ధయ్య సుహాసిని, అనసూయమ్మ ముఖల నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సుధీర్ పాల్గొన్నారు.
రాజంపేట : విశాఖపట్నంలో నిర్వహించే సిఐటియు 18వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ పిలుపునిచ్చారు. జాతీయ మహాసభలను పురస్కరించుకొని మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి సిఐటియు జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.రమణ, ఓబయ్య, ఎ.ఎం.బి.రమణ, కె.ప్రసాద్, ఎం.రమేష్, సునీల్, సుబ్బమ్మ పాల్గొన్నారు. **మదనపల్లెటౌన్:** విశాఖపట్నంలో నిర్వహణ చేబోయే సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు జెండాను కార్మికులు ఆవిష్కరించారు. పట్టణంలో వివిధ ప్రాంతాల్లో సిఐటియు కార్మిక ఎర్రజెండా రెపరెపలాడింది. మున్సిపల్ కార్యాలయం ముందు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు ఎర్రజెండా ఎగురవేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిఐటియు నిరంతరం కృషి చేస్తుందని వెల్లడించారు. కార్మిక హక్కుల కోసం, కార్మిక చట్టాల కోసం దేశ వ్యాప్తంగా పోరాడిన చరిత్ర కలిగిన సంఘం అన్నారు. ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక హక్కులు, చట్టాలను నేడు మోడీ ప్రభుత్వం కార్మిక కోడ్‌లుగా మార్చి కార్మికులను కట్టుబానిసలుగా చేస్తున్నారన్నారు. కార్మిక చట్టాలు కాపాడుకోవడం కోసం, రాష్ట్రానికి ఆర్థిక ప్రధాన వనరుగా ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటుపరం చేస్తున్నారన్నారు. ప్రయివేటీకరణ కాకుండా అడ్డుకుంటామని చెప్పారు. మహాసభల్లో కార్మిక చట్టాలను కాపాడుకోవడం కోసం, ఉక్కు పరిశ్రమను జనవరి 4న విశాఖ బీచ్‌లో లక్షలాది మంది కార్మికులతో జరిగే బహిరంగ సభకు కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి టి.హరీశర్మ, నాయకులు రామకృష్ణ, రాజు, గోపాల్, కృష్ణప్ప, శ్రీరాములు, రామచంద్ర, ఈశ్వరమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

రాజంపేట : జెండా ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

మదనపల్లె : మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

రోడ్ల అభివృద్ధికి రూ.18 కోట్లు మంజూరు

- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బి.సి.జనార్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లె/అర్బన్

మదనపల్లె నియోజకవర్గంలో రోడ్లు అభివృద్ధి చేసేందుకు రూ.18 కోట్లు కేటాయించామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బి.సి.జనార్ధన్‌రెడ్డి వెల్లడించారు. టిడిపి కార్యకర్తల సమావేశంలో పాల్గొనేందుకు సోమవారం మదనపల్లెకి విచ్చేసిన మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ముందుగా మంత్రికి స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా శాలువా, పూలమాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి కోసం రూ.18 కోట్లు నిధులను కేటాయిస్తున్నామని, వారంలో పనులను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మదనపల్లి పట్టణంలోని సిటిఎం రోడ్డు అభివృద్ధి కోసం రూ.3 కోట్లు, మదనపల్లి-రామసముద్రం రోడ్డు నిర్మాణం కోసం రూ.6 కోట్లు, మదనపల్లి నిమ్మనపల్లి రోడ్డు కోసం రూ.4.5 కోట్లు విడుదల చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని స్పష్టం చేశారు. అంతకముందు పార్టీ కార్యాలయంలో తెలుగు తమ్ముళ్ల నుంచి అర్జీలు స్వీకరించి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి ఇఇ అరవింద దేవి, గౌస్ అజామ్, తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి జనార్దన్‌రెడ్డి

కోటి సంతకాల పేరుతో వైసిపి నాటకాలు

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

కోటి సంతకాల పేరుతో వైసిపి నాయకులు చేస్తున్నారని, 1 మంది ఎమ్మెల్యేలు ఉన్నా అసెంబ్లీకి ఎందుకు రావడం లేదని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి నాయకులు గవర్నర్‌ను కలిసే బదులు వచ్చే శీతాకాల అసెంబ్లీ సమావేశాలకు రండి ప్రజా సమస్యలపై చర్చిస్తామన్నారు. ప్రజలు మనకు ఓట్లేసి మనల్ని గెలిపించినప్పుడు మాట్లాడే హక్కు మనకు ఉంటుందన్నారు. ఏదైనా అసెంబ్లీ సాక్షిగా తేల్చుకోవాలే తప్పా కింద ఉన్న కేడర్‌ను ఉత్తేజపరిచేందుకో, లేక మీ ఉనికిని కాపాడుకునేందుకో ఇలాంటి కార్యక్రమాల్లో చేపడుతున్నారన్నారు. బిర్యానీ పొట్లాలు, మందు బాటిల్ ఇచ్చి కలెక్టరేట్లను ముట్టడిం చడం భావ్యం కాదన్నారు. ఇప్పటికైనా జగన్మోహన్‌రెడ్డి తెలుసుకోవాలి అని హితవు పలికారు. ఇప్పుడు ప్రజలు ఎంతో చిత్తశుద్ధితో ఉన్నారని, రాబోయే స్థానిక ఎన్నికల్లోనూ వైసిపి పరాభావం తప్పదని విమర్శించారు. ఇవన్నీ గుర్తుంచుకునే వైసిపి వారు ఇలాంటి పనులు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మస్తాన్ బి, మార్కెట్ కమిటీ చైర్మన్ అనంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, వైస్ చైర్మన్ మట్లి శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు, ఇళ్ల పట్టాలును సద్వినియోగం చేసుకోవాలి.. ప్రభుత్వం అందించే రేషన్ కార్డులు, పట్టాలను ప్రజల సద్వినియోగం చేసుకోవాలని యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల సమస్యలు, అభ్యర్థనలు, వినతులు స్వయంగా విని తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రిని పలువురు కలిసి తమ సమస్యలను వివరించగా, వాటిని పరిష్కరించేందుకు మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం పలువురు అధికారులు నాయకులు దుశాలవ, పుష్పగుచ్ఛాలతో మంత్రిని సన్మానించారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణ ఉద్యమంలో భాగంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. జిల్లా నుంచి సేకరించిన మూడు లక్షల సంతకాల ప్రతులను నింపిన వాహనాన్ని వైసిపి నాయకులు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, ద్వారకనాథ్ రెడ్డి, నిస్సార్ అహ్మద్, మాజీ మేయర్ సురేష్ బాబు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఎన్ కాలనీ శివాలయం వద్ద నుంచి జాతీయ రహదారి మీదుగా నేతాజీ సర్కిల్ వరకు భారీ ర్యాలీనీ నిర్వహించారు. జిల్లాలోని పలు నియోజక వర్గాల నుంచి పెద్దఎత్తున విచ్చేసిన పార్టీ నేత లు కార్యకర్తలు, శ్రేణులు హాజరయ్యారు. పేద విద్యార్థులకు దక్కాల్సిన ప్రయివేట్, బినామీలకు అప్పగించ డాన్నీ సహించబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, పుంగనూరు శ్రీనాథ్‌రెడ్డి అనూషరెడ్డి పాల్గొన్నారు.

పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో వైసిపి శ్రేణులు

నాయకులను అభినందిస్తున్న తహశీల్దార్-శివకుమార్

విఆర్‌ఒల సంఘం ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు మండల విఆర్‌ఒల అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవమైంది. సోమవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో నిర్వహించిన ఈ న్నికలో అసోసియేషన్ అధ్యక్షుడిగా గూడరేవుపల్లి గ్రామ పంచాయితీ విఆర్‌ఒ బుక్కే హేమంత్ నాయక్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా దొడ్డిపల్లి విఆర్‌ఒ బత్తల ఎల్లప్పను, కార్యదర్శిగా బోడుమల్లువారిపల్లి విఆర్‌ఒ ఆర్.సిద్దయ్య ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శిగా కాకులారంపల్లి విఆర్‌ఒ బండి అజయ్, కోశాధికారులుగా రేగళ్ళు విఆర్‌ఒ పి.కవిత, బండ్లవంక విఆర్‌ఒ వి.కళ్యాణిని ఎన్నుకున్నారు. సలహాదారుగా బాలంవారిపల్లికి విఆర్‌ఒ జి.నారాయణ ఎన్నికయ్యారు. సభ్యులుగా ఎస్.ఇమ్రాన్, బి.వెంకటేశ్వర, వి.రెడ్డిశేఖర, ఎం.ప్రసాద్, ఎస్.సుధాకర్, రమణయ్య, శ్రీనివాసులు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ తాము విఆర్‌ఒల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, ఉద్యోగ భద్రత, హక్కుల పరిరక్షణ, సంక్షేమ కార్యక్రమాల అమలులో అసోసియేషన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా ప్రజలకు చేరవేయడంలో తాము భూమిక పోషిస్తామన్నారు. ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించడం పట్ల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ, ఐక్యతతో ముందుకు సాగాలని నిర్ణయించారు. అనంతరం నూతన కమిటీని తహశీల్దారు శివకుమార్ అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

విజయ భాస్కర్‌పై దాడి హేయం : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

వైసిపి బిసి సెల్ అధికార ప్రతినిధి విజయభాస్కర్‌పై టిడిపి గుండాల దాడి చేయడం హేయమైన చర్య అని ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ అన్నారు. టిడిపి వర్గీయుల దాడిలో గాయపడిన విజయభాస్కర్ ఇంటికి ఎమ్మెల్సీ స్వయంగా వెళ్లి పరామర్శించారు. దాడి జరిగిన పరిణామాలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. టిడిపి నేతల తప్పులను ప్రశ్నిస్తే దాడి చేసి చిత్తక బాదుతారా అంటూ మండిపడ్డారు. ఇలాంటి రాజకీయ హింసను టిడిపి నాయ కత్వం అరికట్టాలని ఆయన కోరారు. ఎలాంటి పరిస్థితులలోను కార్యకర్తలు భయపడాల్సిన అవసరం లేదని, కార్యకర్తలకు ఎల్లవేళలా వైసిపి అండగా నిలుస్తుందన్నారు. భయపడకుండా ధైర్యంగా ముందుకు సాగాలని విజయభాస్కర్‌కు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రామాపురం జడ్‌పిటిసి మానస వెంకటరమణ. రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి ఆర్లసుబ్బయ్య, బిసి సెల్ కన్వీనర్ నాగరాజు యాదవ్, రాష్ట్ర పబ్లిక్ సిటీ సెక్రెటరీ రమణ గౌడ్, జిల్లా ఆర్గనేజర్ సెక్రటరీ సుగవాసి శ్యాంకుమార్. జిల్లా టూరిజం కౌన్సిలర్ నెంబర్ కొత్తిమీర ప్రసాద్, సోషల్ మీడియా నాయకులు సురేష్ కుమార్ రెడ్డి, బొమ్మిశెట్టి వెంకటరమణ, అమీర్‌బాషా, రామానుజులు. రెడ్డిశేఖర, వెంకటేష్, మస్తాన్ పాల్గొన్నారు.

రేపు ఉచిత సహాయ జీవన పరికరాల పంపిణీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు ఈ ఏడాది ఆగష్టు 6 నుండి 8 వరకు కృత్రిమ పరికరాల శిబిరాల కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్న వికలాంగులకు, వయోవృద్ధులకు ఈ నెల 17 బుధవారం అలింకో, ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తారు. మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఎమ్మెల్యే షాజహాన్ బాషా, జిల్లా వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కృష్ణకిషోర్, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సిబ్బంది ఉచిత సహాయ జీవన పరికరాల పంపిణీ చేస్తారు.

ఐదేళ్లలోపు పిల్లల పట్ల జాగ్రత్త వహించండి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఊపిరితిత్తులలో నెమ్ము నిర్వహణపై ఐదేళ్లలోపు పిల్లల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ అన్నారు. సోమవారం మండలంలోని చింతపర్తి ఆర్.ఎస్.రోడ్డులో ప్రజలకు న్యూమోనియా వ్యాధి నిర్వహణపై ఆవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు పిల్లల్లో చోటు చేసుకొంటున్న మరణాలకు ప్రధాన కారణం న్యూమోనియా అని, వ్యాధి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్సలపై ప్లకార్డులు ప్రదర్శించి, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మసీదు నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని తూముకుంట కస్పాకు చెందిన మహమ్మదీయ మసీదు నిధులు దుర్వినియోగంపైన సోమవారం కలెక్టర్ నిశాంత కుమార్‌కు కె.ఎస్.మహబూబ్ పీరా, ఎస్. గౌస్ లాజం, మసీదు కమిటీ సభ్యుల ఫిర్యాదు చేశారు. 2017 నుంచి రూ.12.76,438 రావాల్సిన నిధులను ముత్తవల్లి మలయాళం. పాపా సాబ్, షేక్. ముబారక్‌బాషా రూ.10.27 లక్షలను ఖాతాలో నుంచి డ్రా చేశారు. ప్రభుత్వానికి సంబంధించిన నిధులు రూ.2,49,430 బ్యాలెన్స్ ఉందన్నారు. దుర్వినియోగం చేసిన వారిపైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ఇజెఎసి, జెఎసి నాయకులు

రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలి

- సాధన సమితి ఆధ్వర్యంలో విద్యార్థుల భారీ ర్యాలీ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలో రాజంపేట జిల్లా కేంద్రం సాధన కోసం ఇజెఎసి, జెఎసి ఆధ్వర్యంలో ప్రైవేటు, ప్రభుత్వ విద్యాసంస్థల యాజమాన్యాలతో కలిసి విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా వరలక్ష్మి మోకాళ్ళపై కూర్చొని ఆందోళనకారులతో కలిసి నిరసన తెలియజేశారు. రాజంపేట జిల్లా కేంద్రం సాధన కోసం శాంతియుతంగా సాగిన నిరసన రాజంపేటకు ఉన్న చారిత్రక, భౌగోళిక ప్రాధాన్యతను గుర్తించి జిల్లా కేంద్ర హోదా ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో అన్నమయ్య వేషధారణలో పాల్గొన్న చిన్నారులు రాజంపేట విశిష్టతను చాటిచెప్పేలా నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించారు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని రాజంపేట కేంద్ర సాధన ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ర్యాలీలో ఇజెఎసి అధ్యక్షులు ముత్యాల పెంచలయ్య, కరస్పాండెంట్లు ఎస్.ఎన్.శ్రీనివాసులు, ఎం.వి.కుమార్, చంగల్ రాజు, విక్టరీ, నరసింహరెడ్డి, తులసి, డాక్టర్ ప్రదీప్,మదన్మోహన్, గోపీనాథ్, శ్రీవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసరాజు, రామకృష్ణారెడ్డి, రవికుమార్ రాజు, హేమరాజ్, నవీన్, అరవింద్, పిసిఎన్ బ్రదర్స్, టి రాజశేఖర్, కట్టా ఉమా, తులసి, పుష్పలత పాల్గొన్నారు.

టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్

విజేత పెద్దమండ్యం జట్టు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

మదనపల్లి డివిజన్ టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్ మూడు రోజులుగా మదనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శ్రీ వేద పాఠశాలలో నిర్వహిస్తున్నారు. ఇందులో చివరి రోజు సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మదనపల్లెలో మదనపల్లి , పెద్దతిప్ప సముద్రం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో పెద్దతిప్ప సముద్రం జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. శ్రీ వేద పాఠశాలలో నిర్వహించిన రెండవ సెమీఫైనల్‌లో రామసముద్రం, పెద్దమండ్యం జట్ల మధ్య మ్యాచ్ జరగగా పెద్దమండ్యం జట్టు విజయం సాధించింది ఫైనల్స్‌లో పెద్దమండ్యం, పెద్దతిప్పసముద్రం జట్లు తలపడగా పెద్దమండ్యం జట్టు విజేతగా నిలిచింది. జిల్లా స్థాయిలో జరిగే టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్‌లో మదనపల్లె డివిజన్ జట్టుగా పెద్దమండ్యం జట్టు అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో నిర్వహించే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొననుందని మదనపల్లి ఉప విద్యాశాఖ అధికారి లోకేశ్వర్ రెడ్డి, స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగరాజు తెలిపారు. విజేతలకు మదనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయులు రమా, నందా బహుమతులు అందజేసారు. కార్యక్రమంలో మదనపల్లి డివిజన్ కో- ఆర్డినేటర్ భద్రయ్య, శివశంకర్, మండల విద్యాశాఖ అధికారులు రాజగోపాల్, నారాయణ, రామకృష్ణ వ్యాయామ ఉపాధ్యాయులు నరేష్, అన్సర్, రమేష్, శ్రీనివాసులు, శివశంకర్, మనీ, పార్థసారథి, విజయ్ కుమార్, లతా, మహేంద్ర నాయక్, కిరణ్, రెడ్డి వరప్రసాద్ పాల్గొన్నారు.

విజేతగా నిలిచిన పెద్దమండ్యం జట్టు

అమరజీవి త్యాగం చిరస్మరణీయం : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావానికి పునాది అని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు తన ప్రాణాలను త్యాగం చేసిన రోజు (డిసెంబర్ 15)ను ఆత్మార్పణ దినోత్స వంగా జరుపుకుంటున్న సందర్భంగా కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేపట్టిన ఆమరణ సుదీర్ఘ నిరాహార దీక్ష దేశవ్యాప్తంగా ప్రజలను చైతన్యవంతులను చేసి, కేంద్ర ప్రభుత్వాన్ని స్పందించేలా చేసిందన్నారు. ఆయన ప్రాణత్యాగం ఫలితంగా తెలుగు మాట్లాడే ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం లభించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేసిన రోజును రాష్ట్ర వ్యాప్తంగా ఆత్మార్పణ దినంగా జరుపుకోవడం జరుగుతుందని, ఇది భవిష్యత్ తరాలకు ఆయన త్యాగాన్ని గుర్తు చేసే ముఖ్యమైన సందర్భంగా నిలుస్తుందని పేర్కొన్నారు. సాధారణంగా అమరజీవి పొట్టి శ్రీరాములును ఆంధ్రప్రదేశ్ లేదా తెలంగాణతో మాత్రమే అనుసంధానించి చూస్తారని, కానీ ఆయన త్యాగం ప్రభావం దేశ వ్యాప్తంగా విస్తరించిందన్న ముఖ్యమైన అంశాన్ని చాలామంది గుర్తుంచుకోవాలన్నారు. ఆయన సత్యాగ్రహం తరువాత, ఒకే భాష మాట్లాడే ప్రాంతాలను కలిపి రాష్ట్రాలుగా ఏర్పాటు చేయాలన్న భావన బలపడిందని తెలిపారు. దీని ఫలితంగానే సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఫజల్ అలీ ఆధ్వర్యంలో రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ కమిషన్ ఏర్పాటై, దేశవ్యాప్తంగా భాషా, సాంస్కృతిక అంశాలను అధ్యయనం చేసి నివేదికలు సమర్పించిందని వివరించారు. ఇలాంటి కీలకమైన, దీర్ఘకాలిక ప్రభావం చూపిన ఆలోచనలకు అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగమే మూలమని అన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు అసమాన త్యాగం, అహింసా మార్గంలో ఆయన చేసిన పోరాటం భారతదేశ చరిత్రలో స్వర్ణాక్షరాలతో లిఖించబడిన ఘట్టమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఒక వ్యక్తి, 'వన్ మ్యాన్ ఆర్మీ'లా నిలబడి ప్రభుత్వ విధానాన్ని మార్చగలగడం ఆయన అసాధారణ వ్యక్తిత్వానికి నిదర్శనమన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు మాట్లాడుతూ అమర జీవి పొట్టి శ్రీరాములు ఒక గొప్ప త్యాగ మూర్తి, భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం పోరాటం చేసిన ఆద్యుడని కొనియాడారు. ఇటువంటి మహనీయుల జీవితం నుండి స్ఫూర్తి పొంది యువత సన్మార్గంలో, దేశ భక్తితో మెలగాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఎఒ నాగభూషణం, కలెక్టరేట్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. **ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో...**అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా బస్టాండ్ రహదారిలోని ఆయన విగ్రహానికి డైట్ అధ్యాపకులు, ఆర్యవైశ్య ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగువాడి గొప్పతనాన్ని చాటి చెప్పిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అని, రాష్ట్రంలో అంటరానితనం నిర్మూలించేందుకు ఆయన చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. తెలుగువాళ్లందరినీ ఒక్క తాటిపైకి తెచ్చిన ఆయన ప్రతి తెలుగువాడి గుండెల్లో సుస్థిర స్థానం ఏర్పరుచుకున్న అమరుడని కీర్తించారు. కార్యక్రమంలో డైట్ ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, అధ్యాపకులు మునగ శివభాస్కర్, ఆర్యవైశ్య అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ సభ్యులు కూన రెడ్డి సుబ్బరాజా, సుబ్రహ్మణ్యం, విశ్వనాథం, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు. **వాల్మీకిపురం :** స్వాతంత్ర్య సమరయోధుడు అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఎంఇఒ-2 వెంకటలక్ష్మి మాట్లాడుతూ తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలని 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించారన్నారు. పొట్టి శ్రీరాములు పోరాట ఫలితంగా 1953 నవంబరు 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం వసుమతి, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, పురుషోత్తం, శ్రీనివాసులు రెడ్డి, దుర్వాసులు నాయుడు, మంగమ్మ, అమరనాథ్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, జెసి

సుదర్శన్‌రావును సన్మానిస్తున్న న్యాయవాదులు

'గల్లా'కు న్యాయవాదుల సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి-రాజంపేట

ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడిగా కొనసాగుతూ మరోసారి బార్ కౌన్సిల్ సభ్యత్వానికి పోటీ చేస్తున్న గల్లా సుధర్శన్‌రావు సోమవారం రాజంపేట బార్ అసోసియేషన్‌ను సందర్శించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంతు నాయుడుతో పాటు సీనియర్ న్యాయవాదులు లక్ష్మీనారాయణ, కృష్ణకుమార్, ఆనంద్ గజపతి రాజు, వెంకట సుబ్బయ్య, వెంకట స్వామి, చింతల హరీష్ కుమార్ మరియు హైకోర్టు న్యాయవాది కె.సాయిప్రతాప్ ఇతర రాజంపేట బార్ న్యాయవాదులు ఆయనకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రస్తుత బార్ కౌన్సిల్ సభ్యుడిగా గల్లా సుధర్శన్‌రావు న్యాయవాదుల సంక్షేమం, వృత్తి హక్కుల పరిరక్షణ కోసం చేసిన సేవలను ఈ సందర్భంగా న్యాయవాదులు ప్రశంసించారు. భవిష్యత్తులోనూ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ఆయన నిరంతరం కృషి చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

సర్వేను సమగ్రంగా చేపట్టండి

ప్రజాశక్తి - నిమ్మనపల్లి

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 15 నుంచి జనవరి 12 వరకు చేపడుతున్న యునిఫైడ్ ఫ్యామిలీ సర్వేను సమగ్రంగా చేపట్టాలని ఎఒ రమేష్ బాబు, గ్రామ వార్డు సచివాలయాల డిప్యూటీ ఎంపిడిఒ లక్ష్మీపతి తెలిపారు. సోమవారం ఃస్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సంక్షేమ, విద్యా సహా యకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే (ప్రతి ఇంటికి ఫ్యామిలీ బెనిఫిట్ కార్డ్ సర్వే)ను పక్కాగా నిర్వహించాలన్నారు. ఈ సర్వే ద్వారా ప్రభుత్వ పథకాలకు సరైన అర్హులను గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందేలా ప్రక్రియను సులభతరం చేయవచ్చు అన్నారు. భవిష్యత్తు సంక్షేమ సేవలకు సర్వేలోని సమాచారం ప్రభుత్వానికి ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. సర్వేలో వ్యక్తిగత, కుటుంబ స్థాయి వివరాలను సేకరిస్తారన్నారు. వ్యక్తిగత వివరాలు, విద్య, ఉపాధి, సామాజిక, కుటుంబం ఆదాయం, స్థాయి వంటి సమాచారాన్ని సమగ్రంగా సేకరించాలని పేర్కొన్నారు. సేకరించిన సమాచారాన్ని ప్రత్యేకంగా తీసుకువచ్చిన మొబైల్ యాప్‌లో ఎప్పటికప్పుడూ నమోదు చేస్తామని తెలిపారు. సర్వే పారదర్శకత కోసం ఇకెవైసికి సబంధించి సేకరిస్తున్నామని తెలిపారు. సమాచారాన్ని సమగ్రంగా సేకరించి అనుకున్న సమయానికి మొబైల్ యాప్‌లో పొందుపరుస్తూ లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. దీనిపై ఉన్నతాధికారులు కూడా తనిఖీలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో సంక్షేమ విద్యా సహాయకులు పాల్గొన్నారు.

కెకెను సన్మానిస్తున్న అతికారి కృష్ణ

కెకెకు శుభాకాంక్షలు తెలిపిన అతికారి కృష్ణ

ప్రజాశక్తి-రాజంపేట

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న జనసేన పార్టీ కార్యక్రమాల కమిటీ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్‌రావు (కెకె)ను జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ సోమవారం విజయవాడలో కలిసి శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అతికారి కృష్ణ మాట్లాడుతూ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంలో ఆయన అంకితభావం, సంస్థాగత నైపుణ్యం, అవిశ్రాంత కృషి ప్రశంసనీయమన్నారు. ఈ నూతన బాధ్యత ఆయనకు నాయకత్వం, ప్రజాసేవ పట్ల నిబద్ధతకు తగిన గుర్తింపుగా నిలుస్తుందని కొనియాడారు. నిరంతరం విజయం సాధించాలని, పోలీసు సిబ్బంది సంక్షేమం, రాష్ట్ర పురోగతికి దోహదపడాలని ఆకాంక్షించారు.

కలెక్టర్ కార్యాలయం వద్ద బండకిందపల్లె గ్రామప్రజలు

బండకిందపల్లెని పంచాయతీ కేంద్రంగా ప్రకటించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: నియోజకవర్గంలోని బండకిందపల్లెని పంచాయతీ కేంద్రంగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు సోమవారం గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం బండకిందపల్లె కోటవారిపల్లె పంచాయతీలో భాగంగా ఉందన్నారు 150 మైలు నుంచి బండకిందపల్లె మీదుగా కొండమీదపల్లె (పెంచుపడు పంచాయతీ), అడవిలోపల్లె, పాకలవారిపల్లి, పాలేందొన, బైరుకోన, పెద్దిరెడ్డిగారిపల్లె, గుట్టమీదపల్లి, బండకిందపల్లి, మరాటవాండ్లపల్లి, నారకవాండ్లపల్లి, చెరువుకిందపల్లి, గూటంవారిపల్లె, అల్లివంకలు (కోటవారిపల్లి) పంచాయతీ పరిధిలోకి వస్తాయని చెప్పార. బండకాడపల్లి కొత్తపల్లి పంచాయతీ, నాయనవారిపల్లి, ఎర్రబల్లి, బోగూటివారిపల్లి వలసపల్లి పంచాయతీ పరిధిలో పల్లెలు ఉన్నాయన్నారు. ఈ పల్లెలు అన్నింటికీ బండకిందపల్లి కేంద్రబిందువుగా ఉందని, కావున పంచాయతీ చేస్తే అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. పస్తుతం ఉన్న పంచాయతీ కేంద్రాలు పల్లెలకు కాస్త దూరంగా ఉండడం, సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సచి వాలయాలు, పంచాయతీ కేంద్రాలకు వెళ్లడానికి అనుకూలత తక్కువగా ఉందన్నారు. బండకిందపల్లిని పంచాయతీ కేంద్రంగా ఏర్పాటు చేస్తే అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందన్నారు. అధికారులు స్పందించి ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని బండకిందపల్లెని పంచాయతీ కేంద్రం చేయాలని కోరారు.

ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శిగా అల్లం అశోక్ కుమార్

ప్రజాశక్తి - నందలూరు : కడప జిల్లాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో లో ఆదివారం జరిగిన ఎస్‌టియు ఎపి 79వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో జరిగిన ఎన్నికలలో రాజంపేట రీజియన్ నుంచి సీనియర్ నాయకులు, సమాజ సేవకులు, కవి, కళాకారులు, పెనగలూరు ఉన్నత పాఠశాల మ్యాథ్స్ ఉపాధ్యాయులు అయిన నందలూరు మండల వాసి అల్లం అశోక్ కుమార్ ని రాష్ట్ర కార్యదర్శిగ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. ఈ సందర్భంగా నందలూరు ఎస్‌టియు అధ్యక్షులు లీలా కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతమ్మ, గౌరవాధ్యక్షులు నరసింహారావు, ఆర్థిక కార్యదర్శి మార్కండేయ రెడ్డి, జిల్లా కౌన్సిలర్లు మోహన్ రాజు, షఫీ, మహేశ్వర బాబు, ఎస్‌టియు నాయకులు జెవి రమణ, సంజీవ్ ప్రసాద్, శివ పనింద్ర, భరత్ కుమార్, చంద్రశేఖర్, సందాని, ఫాతిమున్, గాయత్రి అల్లం అశోక్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి సంఘ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలియజేశారు.

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

- కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి - రాయచోటి

స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుంచి కలెక్టర్ నిశాంత్ కుమార్ అర్జీలను స్వీకరించారు. కలెక్టర్‌తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జెసి ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదన్‌రావు, సర్వే ఎడి భరత్ కుమార్, ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, ఆయా శాఖల పరిధిలో పిజిఆర్ఎస్ గ్రీవెన్స్‌పై ఆడిట్ నిర్వహించాలన్నారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడాలని, పెండింగ్ ఆడిట్ పూర్తి చేయాలని పేర్కొన్నారు. జిల్లా అధికారులు వారి పరిధిలో ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడూ అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన మండలాలను, గ్రామాలను పర్యటించి అక్కడి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలలో సమస్యలపై పూర్తి అవగాహన అధికారులు కలిగి ఉండాలని అన్నారు. జిల్లాలోని ఆయా శాఖల అధికారులు వారికి కేటాయించిన లక్ష్యాలను చేరుకునే విధంగా అధికారులు క్రమశిక్షణతో పని చేయాలని తెలిపారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జిల్లా కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్స్, టీ సౌకర్యాలను కల్పించారు. కార్యక్రమంలో అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు వివిధ రకాల అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

'ఇంధన పొదుపుపై అవగాహన కల్పించాలి'

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి, అధికారులు

ప్రజాశక్తి-రాయచోటి

ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంధన పొదుపు వారోత్సవాల పోస్టర్‌ను జిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ వరకు ఇంధన పొదుపుపై జిలా వ్యాప్తంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి పౌరుడు విద్యుత్‌ను బాధ్యతగా వినియోగించి, శక్తి ఆదా దిశగా అడుగు వేయాలని పిలుపునిచ్చారు.ప్రతి వ్యక్తి ఒక యూనిట్ విద్యుత్‌ను ఆదా చేస్తే దేశవ్యాప్తంగా 135 కోట్ల యూనిట్ల విద్యుత్‌ను ఆదా చేయవచ్చని తెలిపారు. విద్యుత్ ఆదా చేయడం ద్వారా బిల్లులు తగ్గడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతూ, భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. మన జీవితం శక్తి ఆదా ఇంధన పొదుపు దిశగా మనం ఒక అడుగు వేయాలిన్నారు. విద్యుత్ ఆదా చేయండి మీ పిల్లల భవి ష్యత్తు కోసం అనే నినాదాన్ని ప్రజలు ఆచరణలో పెట్టాలని కలెక్టర్ సూచించారు. విద్యుత్ వృథా కనిపించిన చోట వెంటనే నివారించాలని, ఇల్లు లేదా కార్యాలయాల్లో అందరూ కలిసి శక్తి ఆదా చర్యలను పాటించాలని కోరారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు, సర్వే ఎడి భరత్ కుమార్, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

జనసేనలోకి బిసి నాయకుడు బత్తిన గంగయ్య

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంలోని కె.బుడుగుంటపల్లె గ్రామ పంచాయతీకి చెందిన మాజీ ఎంపిటిసి సభ్యులు బత్తిన గంగయ్య యాదవ్ సోమవారం జనసేన పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ సమక్షంలో జన సేన కండువా కప్పుకున్నారు. నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతం దిశగా మరో కీలక అడుగు పడిందని ఎమ్మెల్యే శ్రీధర్ అన్నారు. గంగయ్య యాదవ్ వర్గానికి చెందిన 200 కుటుంబాలు జనసేన పార్టీలో చేరారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన పలువురు నాయకులను కూడా జనసేన పార్టీలోకి ఆహ్వానించి కండువాలు కప్పారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పగడాల వరలక్ష్మి కండువాలు వేసి పార్టీలోకి స్వాగతం పలికారు. ప్రభుత్వ విప్ మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆశయాలు, పేదల పట్ల ఆయన చూపే ప్రేమ, సమస్యలను పరిష్కరించే నిజాయితీ నచ్చి పార్టీలోకి వస్తున్న ప్రతి ఒక్కరికీ తాను అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, పగడాల చంద్రశేఖర్, వెంకటేష్, సర్పంచ్ సంయుక్త, ముద్ద పోలు రామసుబ్బయ్య పాల్గొన్నారు.

గంగయ్య యాదవ్‌ను జనసేనలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మహమ్మద్ జమాలుల్లాఖాన్

సైబర్ నేరాల నిర్మూలనే పోలీసుల లక్ష్యం

ప్రజాశక్తి - నందలూరు: సమాజంలో సైబర్ నేరాల నిర్మూలనే లక్ష్యంగా పోలీసులు అహర్నిశలు కృషి చేస్తున్నారని శక్తి టీం కో1ఆర్డినేటర్ మహమ్మద్ జమాలుల్లాఖాన్ పేర్కొన్నారు. ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు రాజంపేట ఎఎస్‌పి మనోజ్ రామనాథ్ హెగ్దే అధ్వర్యంలో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పర్యవేక్షణలో సోమవారం ఆల్విన్ మౌంట్ కార్మెల్ స్కూల్లో జరిగిన శక్తి యాప్ అవగాహన సదస్సులో పాల్గొని ఆయన మాట్లాడుతూ నేర రహిత సమాజం కోసం ప్రజలను, విద్యార్థులను చైతన్య పరచడంకోసం శక్తియాప్ కీలకంగా పనిచేస్తుందన్నారు. మహిళలపై, బాలికలపై జరిగే నేరాలు, ఈవ్ టీజింగ్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. అసాంఘీక కార్యకలాపాలకు స్వస్తి పలకాలన్నారు. మైనర్‌లు డ్రైవింగ్ చేయరాదన్నారు. అలా డ్రైవింగ్ చెస్తే మైనర్లపైన,వారి తల్లిదండ్రులపైన కేసులు నమోదు చేస్తామన్నారు. ముఖ్యమైన వివిధ అంశాలపై విద్యార్థులలో చైతన్యం తీసువచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుమారునిపల్లె ఇసుక క్వారీ రద్దు చేయాలి

ప్రజాశక్తి - నందలూరు: మండలంలోని కుమారుని పల్లె ఇసుక క్వారీని రద్దు చేయాలని సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు వైసిపి నందలూరు మండల కన్వీనర్ సిద్ధవరం గోపిరెడ్డి, టంగుటూరు మాజీ సర్పంచ్ గంగి నాయుడు, వెంకటయ్య, సి.నాగరాజు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపిరెడ్డి మాట్లాడుతూ నందలూరు మండలంలోని కుమా రునిపల్లిలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఇసుక క్వారీ వలన కుమారుని పల్లె, కుందా నెల్లూరు, చింతకా యలపల్లి, గట్టుమీద పల్లి, గ్రామాల వారికి రాబోయే రోజులలో సాగు, తాగు నీరు లేకుండా పోతుందని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. పై గ్రామాలకు ప్రాజెక్టు వల్ల నీరు వచ్చే పరిస్థితి లేకుండా పోతుందని వందలాది వ్యవసాయ బోర్లు వేసుకుని సాగునీరు లేక ఇసుక క్వారీ ఏర్పాటుతో చింతకా యలపల్లి మదన మోహన పురం గట్టుమీద పల్లె మొదలైన గ్రామాలు వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పగలు, రాత్రి అనక ఆదివారం సెలవు దినములలో అక్ర మంగా క్వారీలోనే మిషన్లతో లోడ్ చేసుకుంటూ నిబంధన లను అతిక్రమిస్తున్నారనిపై విషయమై గ్రామస్తులు ప్రశ్నించిన లెక్కచేయకుండా ఇసుకను చెయ్యేటిలో అక్రమముగా పెద్ద పెద్ద హిటాచీతో లారీలు, టిప్పర్లతో 40 టన్నుల పైనే ఉన్న వాహనాలతో తీసుకొని వెళ్లడం జరుగుతుందనీ ఇప్పటికే భారీ వాహనాల వల్ల రోడ్లు పూర్తిగా దెబ్బ తిన్నాయని గ్రామ ప్రజలు వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

మహారాజ శ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో, కదిరి

O.S.No: 222/2023

Between:

ఎస్.సుబహాన్ S/o వలిసాబ్ D.No.2-75, N.P కుంట గ్రామం మరియు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా ...వాది

మరియు

ఎస్.కళ్యాణ చక్రవర్తి S/o వెంకటరమణ D.No.12-138, చక్కవాండ్లపల్లి, గాలీవీడు మండలం, అన్నమయ్య జిల్లా ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమను

పై దావాలో వాది అయిన ఎస్.సుబహాన్ O.S.No: 222/2023 దావా దాఖలు చేసియున్నాడు. సదరు దావాలో ప్రతివాది అయిన ఎస్.కళ్యాణ చక్రవర్తి S/o వెంకటరమణ D.No.12-138, చక్కవాండ్లపల్లి, గాలీవీడు మండలం, అన్నమయ్య జిల్లా నీకు తెలియజేయడమేమనగా పై దావాలో నీ హాజరు నిమిత్తం పై కోర్టు నందు మీ హాజరు నిమిత్తం వాయిదా తేదీ 26-12-2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు వాయిదా ఉన్నది. కావున సదరు తేదీ నాడు నీవు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై అక్షేపణలు వున్న ఎడల తెలుపుకొనవలయును అట్లు హాజరు కానిచో ఘనమైన కోర్టువారు పై దావాలో ని పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా నీకు తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది: 26-12-2025

స్థలం:కదిరి ఇట్లు

బి.రామోహన్ రెడ్డి, బి.ఎ.బి.ఎల్

వాది తరపు వకీలు, కదిరి

విఆర్ఒపై సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-రాజంపేట : 30 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి తన భార్య, అనుచరుల పేరిట అక్రమంగా ఆన్‌లైన్, రిజిస్ట్రేషన్ చేయించిన విఆర్ఒ సంఘం అధ్యక్షుడు రంగాల భుజంగరావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పోలి శివ కుమార్ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సబ్ కలెక్టర్ హెచ్.ఎస్.భావనకు ఫిర్యాదు చేశారు. పోలి రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 1025-1/2/3/4/7/10లో 30 ఎకరాలు ఆక్రమించి మామిడి చెట్లు నాటారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడిన వీఆర్వోపై చర్యలు తీసుకుని వారి కబంధహస్తాల నుంచి ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని కోరారు.

మల్లయ్య కొండకు యాత్రికుల తాకిడి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి: తంబళ్లపల్లె మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయానికి సోమవారం భక్తులతో కిటకిట లాడింది. ఈశ్వరప్ప, మల్లికార్జున స్వామిని, ప్రత్యేక అలంకరణతో అలం కరించి పంచామృతాభిషేకాలు చేశారు. కొండపైన భక్తుల పేరిట పూజలు అభిషేకాలు చేసి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. లి ఆలయానికి దిగువన ఉన్న వెలుగు మల్లమ్మకు అమ్మవారికి పూజారి శేఖర్ విజ యనిర్మల ప్రత్యేక అలంకరణతో వెలుగు మల్లమ్మ అమ్మవారిని అలంకరించారు.

మాజీ ఎంపిటిసికి 'మేడా' పరామర్శ

ప్రజాశక్తి - నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలోని జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ఎదురుగా ఉన్న వీధిలోని మాజీ ఎంపిటీసీ స్వామి ఎలుమలై ఇల్లు గత శుక్రవారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించిన విషయం విధితమే, ఈ విషయం తెలుసుకున్న ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి బాధితులు ఏలుమలైని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ రెడ్డి ద్వారా ప్రధానమంత్రి సహాయ నిధి ద్వారా బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.అనంతరము వైసిపి నాయకులు బుసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో అతని ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని పరామర్శించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు అనుదీప్, వైసిపి మండల మహిళా అధ్యక్షులు పల్లె మాధవి, మండల కోఆప్షన్ సభ్యులు ఖలీముల్లా ఖాన్, ఒర్సు శీను, తుమ్మల శ్రీధర్ గౌడ్, విజయుడు, మోహన్ రెడ్డి, రాంరెడ్డి, ట్రాక్టర్ ప్రసాద్, ఆది నారాయణ, శ్రీవాణి, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఎలుమలైని పరామర్శిస్తున్న ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి

షోరూంను ప్రారంభిస్తున్న రమేష్ నాయుడు

ఎలక్ట్రికల్ బైక్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలకేంద్రంలోని పీలేరు రహదారిలో ఎంపిపి పాఠశాల ఎదురుగా ఏర్పాటు చేసిన రిషి డ్రైవ్ ఎలక్ట్రికల్ షోరూమ్‌ను మండల టిడిపి అధ్యక్షులు చప్పిడి రమేష్ నాయుడు సోమవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం షోరూం ప్రోపరేటర్ బలిజ పల్లికి చెందిన రిషి చప్పిడి రమేష్ నాయుడును శాలువ కప్పి పూలదండలతో సత్కరించారు. కార్యక్రమంలో సుండుపల్లి మండల టిడిపి నాయకులు బలిజపల్లి టిడిపి నాయకులు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి-రాజంపేట

అన్నమాచార్యులు, భక్తకన్నప్ప వంటి మహా భక్తులు పుట్టి నడయాడిన పుణ్యభూమి అయిన రాజంపేటలో అన్నమయ్య జిల్లా కేంద్రంగా ప్రకటించాలని సోమవారం విజయవాడలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు రాజంపేట జనసేన పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పార్లమెంటు కేంద్రాన్ని జిల్లా కేంద్రంగా చేస్తామని హామీ ఇచ్చి వైసీపీ నాయకులకు మేలు చేసేందుకు గత ప్రభుత్వం రాజంపేటకు తీవ్ర ద్రోహం చేసిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు విశ్వాసంతో ఉన్నారని, రాజంపేట వాసుల మనోవేదనను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి ఈ ప్రాంతానికి న్యాయం చేయాలని కోరారు.

మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న అతికారి కృష్ణ

క్రైం కార్నర్

బాలిక అదృశ్యం : కేసు నమోదు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ జిలాని బాష తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని నిమ్మనపల్లె పంచాయతీ దేవళం కురవపల్లెకు చెందిన ఎస్.రాధ, ఎస్.వెంకటరమణలకు చిన్న కుమార్తె నవ్య(16) నిమ్మనపల్లి జడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతూ మధ్యలోనే బడి మానేసి తల్లిదండ్రులతో కలిసి ఇంటి వద్ద ఉంటున్నాదన్నారు. ఈ నెల 13వ తేదీ ముగ్గురు కలిసి ఉదయం పొలం వద్దకు వెళ్లి పొలం పనులు చూసుకుని సాయంత్రం నాలుగు గంటలకు తల్లి ఆమె కుమార్తెతో కలిసి పశువులకు గడ్డి కోసుకొని ఇంటికి వచ్చినట్లు తెలిపారు. బాలిక తల్లి ఇంటి వద్ద స్నానం చేసుకొని తిరిగి రాగా, ఇంతలో ఇంటిలో ఉన్న కుమార్తె కనిపించలేదన్నారు. చుట్టుపక్కల విచారించి వెతికిన ఎక్కడ లేదన్నారు. వెంటనే పొలం వద్ద ఉన్న భర్తకు సమాచారం అందించి బంధువులు, బాలిక స్నేహితులు ఇళ్ల వద్ద విచారించి, వెతికినా ఎక్కడ కూడా బాలిక ఆచూకీ తెలియలేదన్నారు. దీనితో బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బాలిక ఆచూకీ తెలిసిన వారు వెంటనే స్థానిక పోలీసులకు లేదా కుటుంబ సభ్యులకు సమాచారాన్ని తెలిపాలని కోరారు.

అప్పుల బాధతో చిరువ్యాపారి ఆత్మహత్య

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

అప్పుల బాధతో చిరువ్యాపారి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం మృతదేహం చెరువులో తేలియాడడంతో విషయం వెలుగులోకి వచ్చింది. తాలూకా సిఐ కళా వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు.. పుంగనూరు రోడ్డు బసినికొండకు చెందిన కృష్ణారెడ్డి కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి(45) సమోసాలు, చిప్స్ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇతనికి భార్య రేణుక, కుమార్తెలు ఉమా, భవ్య, కుమారుడు మంజునాథరెడ్డి ఉన్నారు. ఈ క్రమంలో చంద్రశేఖర్ రెడ్డికి మద్యం సేవించే అలవాటు ఉండడంతో పాటు పలువురి వద్ద రూ.5 లక్షలకు పైగా అప్పులు చేశాడు. కుటుంబంలో తరచూ భార్యభర్తలు గొడవపడేవారు. చంద్రశేఖర్‌రెడ్డి రెండు రోజుల కిందట ఇంట్లోంచి వెళ్లిపోయాడు. ఈ మేరకు భార్య రేణుక తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా స్థానిక నక్కల కుంట చెరువు తూము వద్ద గుర్తు తెలియని వ్యక్తి చనిపోయి తేలియాడుతూ కనిపించడం సోమవారం స్థానికులు గుర్తించారన్నారు. అక్కడి ప్రజలు తమకు ఇచ్చిన సమాచారంతో వెంటనే వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి, దర్యాప్తు అనంతరం మృతుడి ఆచూకీ తెలుసు కున్నట్లు చెప్పారు. మృతదేహాన్ని స్థానికుల సాయంతో వెలికి తీసి మృతుడు చంద్రశేఖర్‌రెడ్డిగా గుర్తించి కుటుంబ సభ్యులకు తెలియజేశామన్నారు. మృతుడు భార్య ఫిర్యాదు మేరకు అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు

స్కూటర్ ఢీకొని రైతుకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

స్కూటర్ ఢీకొని రైతు తీవ్రంగా గాయపడ్డ సంఘటన సోమవారం చౌడేపల్లి మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నాగేశ్వరావు కథనం మేరకు.. మండలంలోని ఎ.కొత్తకోట పంచాయతీ, బండ్లపల్లికి చెందిన రైతు గిరినాథరెడ్డి స్కూటీలో సొంత పనిపై చౌడేపల్లికి వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఆమనికుంట వద్ద మరో స్కూటర్ వేగంగా వచ్చి రైతును ఢీ కొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రైతును స్థానికులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి...

ప్రజాశక్తి -మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన సోమవారం కురబలకోట మండలంలో చోటు చేసుకుంది. ముదివేడు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కురబలకోట మండలం, గౌనివారిపల్లికి చెందిన సిద్ధారెడ్డి సొంత పనిపై స్కూటీలో అంగళ్లుకు బయల్దేరాడు. ఇదే సమయంలో విశ్వం కళాశాల చదువుకుంటున్న మొలకలచెరువుకు చెందిన విద్యార్థి ఖదీర్ ద్విచక్రవాహనంలో వెళుతూ ముందు వెళుతున్న సిద్ధారెడ్డి బైకును వెనకనుంచి ఢీ కొన్నాడు. దీంతో ఇద్దరూ కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ముదివేడు పోలీసులు విచారిస్తున్నారు.

టెంపో ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని ప్యారంపల్లిమిట్ట వద్ద ఆటోను టెంపో ఢీకొనడంతో ఆవుల శారదమ్మ (45) అక్కడికక్కడే మృతి చెందారు. సోమవారం ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ పెద్దమండెం కోటాల వద్ద టమోటా తోటకుపూరి కట్టడానికి గోపనపల్లి గ్రామం గొల్లపల్లికి చెందిన ఆవుల శారదమ్మ ఆటోలో వెళ్తుండగా టిప్పర్ ఢీకొందన్నారు. భాగ్యమ్మ, మల్లేశ్వరి, రాజేశ్వరిలను 108లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని తెలిపారు. వారి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశామని తెలిపారు.